# జనరల్ స్టడీస్

## భారతదేశ చరిత్ర

**మితవాద నాయకులు క్రీ.శ.1905 వరకు జాతీయోద్యమానికి నాయకత్వం వహించారు. వీళ్లు రాజ్యాంగబద్ధమైన విధానాల ద్వారా బ్రిటిష్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తమ డిమాండ్లను నెరవేర్చుకోవాలని భావించి విఫలమయ్యారు. దీంతో కాంగ్రెస్‌లోని ఒక వర్గం నాయకులు డిమాండ్లను పోరాడి సాధించుకోవాలన్న ఉద్దేశంతో అతివాదయుగ ప్రారంభానికి కారకులయ్యారు.**

### అతివాద యుగం (1905-19)

**అతివాద యుగం ఆవిర్భావానికి కారణాలు:**

★ బ్రిటిష్ పరిపాలకుల ఆర్థిక దోపిడిని భారతీయులు గ్రహించారు. ఆంగ్లేయులు అవలంబించిన ఆర్థిక విధానాలతో భారతదేశంలో 1896 – 1900 సంవత్సరాల మధ్య తీవ్ర కరవులు సంభవించాయని అర్థం చేసుకున్నారు.

★ మితవాదులు అవలంబించిన విధానాలు విఫలం కావడం, 1892లో బ్రిటిష్ ప్రభుత్వం రూపొందించిన భారత కౌన్సిళ్ల చట్టం భారతీయులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

★ బ్రిటిష్ ప్రభుత్వం – జాతీయవాదాన్ని ప్రచారం చేయడం నేరమంటూ 1898లో చట్టాన్ని తెచ్చింది. పత్రికల స్వేచ్ఛను హరించడానికి 1904లో భారత అధికార రహస్యాల చట్టాన్ని రూపొందించింది. జాతీయవాదాన్ని ప్రచారం చేసినందుకు బాలగంగాధర తిలక్, ఇతర పత్రికా సంపాదకులను జైలులో నిర్బంధించడం లాంటి అణచివేత విధానాలకు పాల్పడింది.

★ సామాన్య ప్రజలను జాతీయోద్యమంలో భాగస్వాములుగా చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఏడాదికి ఒకసారి సమావేశాల నిర్వహణకు బదులు నిరంతర రాజకీయ కార్యక్రమాలు నిర్వహించాలని కాంగ్రెస్ భావించింది.

★ భారతీయుల్లో ఆత్మగౌరవం పెరగడం, స్వరాజ్యం ప్రతి భారతీయుడి జన్మహక్కు అని తిలక్ ప్రకటించడం భారతీయుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచాయి.

★ జపాన్ గొప్ప శక్తిగా ఎదగడం; 1905లో జపాన్, రష్యాను ఓడించడం, 1896లో ఇథియోపియా చేతిలో ఇటలీ సైన్యం ఓటమి పాలవడం; ఐర్లాండ్, రష్యా, ఈజిప్ట్, టర్కీ, చైనాలలో జరిగిన విప్లవ ఉద్యమాలు మొదలైనవి భారతీయులు స్వరాజ్యం కోసం పోరాటాన్ని ముమ్మరం చేయడానికి తోడ్పడ్డాయి.

★ అతివాదం ఆవిర్భవించడానికి తక్షణ కారణం కర్జన్ దుష్టపరిపాలన, బెంగాల్ విభజన.

**అతివాదుల లక్ష్యాలు:** స్వరాజ్య సాధనే తమ లక్ష్యమని అతివాదులు ప్రకటించారు. వీరి దృష్టిలో స్వరాజ్యం అంటే బ్రిటిష్ వలసలైన ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మాదిరి స్వపరిపాలన కాదు. స్వరాజ్యం అంటే పూర్తి స్వాతంత్ర్యం.



R-9-3-15

## అతివాద నాయకులు

పంజాబ్‌కు చెందిన లాలాలజపతిరాయ్, మహారాష్ట్రకు చెందిన బాలగంగాధర తిలక్, బెంగాల్‌కు చెందిన బిపిన్ చంద్రపాల్ ముఖ్యమైన అతివాద నాయకులు. వీరే లాల్-బాల్-పాల్‌గా, అతివాదత్రయంగా ప్రసిద్ధి చెందారు. వీరితోపాటు బెంగాల్‌కు చెందిన అరబిందో ఘోష్ కూడా ప్రముఖ అతివాద నాయకుడు.



**బాలగంగాధర తిలక్:** తిలక్‌ను భారతీయులు లోకమాన్య అని కీర్తించగా, బ్రిటిషర్లు 'భారత అవిశ్రాంత జనకుడి'గా పేర్కొన్నారు. సామాన్య ప్రజలను జాతీయోద్యమంలో భాగస్వాములుగా చేయడానికి 1893లో గణపతి ఉత్సవాన్ని, 1895లో శివాజీ ఉత్సవాన్ని ప్రారంభించారు.

★ 1896 – 97 లో కరవుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహారాష్ట్రలో పన్నుల నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించారు. తిలక్ న్యూ ఇంగ్లిష్ స్కూల్ స్థాపనకు కృషి చేశారు. ఇదే తర్వాతి కాలంలో ఫెర్గుసన్ కళాశాలగా అభివృద్ధి చెందింది. ఆంగ్ల భాషలో మహారట్ట, మరాఠీ భాషలో కేసరి పత్రికలను స్థాపించారు. తిలక్ 1916 ఏప్రిల్‌లో హోం రూల్ లీగ్‌ను ప్రారంభించారు.

**లాలాలజపతిరాయ్:** పంజాబ్ కేసరిగా ప్రసిద్ధి చెందారు. ఈయన ఆర్య సమాజంలో 'కళాశాల' విభాగానికి నాయకుడు. బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నందుకు 1907లో బ్రిటిష్‌వారు బర్మా దేశానికి పంపించారు. లజపతిరాయ్ 'పంజాబీ' అనే వార్తాపత్రికకు సంపాదకత్వం వహించారు. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన ఉద్యమంలో పాల్గొని, పోలీసుల దెబ్బలకు గాయపడి మరణించారు.

**బిపిన్ చంద్రపాల్:** భారత విప్లవ భావాల పితామహుడిగా ప్రసిద్ధి చెందారు. 1901లో న్యూ ఇండియా అనే పత్రికను ప్రారంభించారు. 1906లో అరబిందో ఘోష్, బిపిన్ చంద్రపాల్ ప్రారంభించిన వందేమాతరం పత్రిక అతివాద భావాలను ప్రచారం చేయడంలో కీలక పాత్ర వహించింది. అరబిందో ఘోష్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పనందుకు బ్రిటిష్ ప్రభుత్వం బిపిన్ చంద్రపాల్‌కు 1907లో ఆరునెలల కారాగార శిక్ష విధించింది. ఆ శిక్ష అనుభవించాక 1908 – 11 మధ్యకాలంలో ఇంగ్లండ్‌లో గడిపారు. తర్వాత 20 ఏళ్లపాటు జాతీయోద్యమంలో ఎలాంటి క్రియాశీలక పాత్ర వహించలేదు.

**అరబిందో ఘోష్:** బరోడాలో ఉపన్యాసకుడిగా పనిచేస్తూ 'న్యూ ల్యాంప్స్ ఫర్ ఓల్డ్' అనే వ్యాసాల ద్వారా మితవాద రాజకీయాలను విమర్శించారు. వందేమాతరం ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా 1906లో కలకత్తాలో ప్రారంభించిన బెంగాల్ జాతీయ కళాశాలకు అరబిందో ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. 1908లో బ్రిటిష్ ప్రభుత్వం వీరిని అరెస్ట్ చేసింది. 1910లో పాండిచ్చేరికి వెళ్లి ఆధ్యాత్మిక, సాహిత్య విషయాలపై దృష్టి పెట్టారు. సావిత్రి, ది లైఫ్ డివైన్ అనే రెండు గ్రంథాలు ఈయన రచనల్లో ప్రధానమైనవి.

## వందేమాతర ఉద్యమం

బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా భారతీయులు చేపట్టిన ఉద్యమమే వందేమాతర ఉద్యమంగా ప్రసిద్ధి చెందింది. ఈ కాలంలో బంకించంద్ర ఛటర్జీ రచించిన 'ఆనంద మఠం' అనే గ్రంథం నుంచి స్వీకరించిన వందేమాతరం నినాదాన్ని భారతీయులంతా ఎలుగెత్తిచాటారు.

★ 1905లో అప్పటి వైస్రాయి కర్జన్ ఢాకా, చిట్టగాంగ్, అస్సాం, మైమెన్‌సింగ్ ప్రాంతాలతో కూడిన తూర్పు బెంగాల్, అస్సాం రాష్ట్రాన్ని సృష్టించాడు. దీనికి ఢాకా రాజధాని. ప్రస్తుత పశ్చిమ బెంగాల్, బీహార్, ఒరిస్సాలను విడదీసి దీనికి కలకత్తాను రాజధానిగా చేశాడు.

★ పరిపాలన సౌలభ్యం కోసమే బెంగాల్‌ను విభజించినా దీనికి ప్రధాన కారణం బెంగాల్‌లో జాతీయ ఉద్యమాన్ని బలహీన పరచడమే అనే సత్యాన్ని బెంగాలీలు గ్రహించారు. విభజన తర్వాత బెంగాల్‌లో బెంగాలీలు మైనారిటీలుగా మిగిలారు. ఈ విధంగా హిందూ-ముస్లింలను విభజించి జాతీయోద్యమాన్ని దెబ్బతీయాలని బ్రిటిష్‌వారు భావించారు.

★ వందేమాతర ఉద్యమంలో భాగంగా స్వదేశీ వస్తు వినియోగం, విదేశీవస్తు బహిష్కరణ ఉద్యమాలను చేపట్టారు. విదేశీ వస్తు బహిష్కరణను మొదట కలకత్తా వారపత్రిక సంజీవనిలో 1905 జులై 13న ప్రతిపాదించారు.

✪ బహిష్కరణ కార్యక్రమం నాలుగు విధాలుగా జరిగింది.

1. బ్రిటిష్ వారి దుస్తులు, ఉప్పు, చక్కెర, విదేశీ ఉత్పత్తుల బహిష్కరణ.
2. ఆంగ్లభాషను వాడకుండా ఉండటం
3. ప్రభుత్వ ఉద్యోగాలకు రాజీనామా చేయడం
4. విదేశీ ఉత్పత్తులను ఉపయోగించే వారి సామాజిక బహిష్కరణ

★ 1905 ఆగస్టు 7న కలకత్తాలోని టౌన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో వీటిని ఆమోదించారు. 1905లో గోపాలకృష్ణ గోఖలే అధ్యక్షతన జరిగిన బెనారస్ సమావేశంలో కాంగ్రెస్ 'స్వదేశీ' ఉద్యమానికి పిలుపునిచ్చింది.

★ బెంగాల్ విభజన అమల్లోకి వచ్చిన రోజైన అక్టోబరు 16ను జాతీయ దుర్దినంగా పాటించారు. సోదర భావాన్ని ప్రతిబింబించే విధంగా ఆరోజును రాఖీబంధన్ దినంగా జరుపుకున్నారు. స్వదేశీ ఉద్యమం కుటీర పరిశ్రమలు, అగ్గిపెట్టెలు, సబ్బులు, చేనేత, పట్టు పరిశ్రమల అభివృద్ధికి దోహదపడింది. ప్రభుత్వ సర్వీసులు, న్యాయస్థానాలు, పాఠశాలలు, కళాశాలలను బహిష్కరించడం ద్వారా బ్రిటిష్ ప్రభుత్వం పట్ల సహాయ నిరాకరణను ప్రకటించారు.

★ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల బహిష్కరణతో స్వదేశీ విద్యా సంస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఉద్యమ కాలంలో కలకత్తా విశ్వవిద్యాలయాన్ని గోలంఖానా (బానిస గృహం)గా చిత్రీకరించారు.

★ 1905 నవంబరు 10న జరిగిన ప్రముఖ బెంగాలీల సమావేశంలో జాతీయ విద్యామండలిని ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. 1908 నాటికి 300 ప్రాథమిక, 25 సెకండరీ జాతీయ పాఠశాలలను స్థాపించారు.

★ బాలగంగాధర తిలక్ ఈ ఉద్యమాన్ని దేశంలోని వివిధ ప్రాంతాలకు ముఖ్యంగా పూనా, బొంబాయిలకు తీసుకెళ్లడంలో సఫలీకృతులయ్యారు. 1905 చివరినాటికి భారతదేశంలో మిగతా ప్రాంతాలకు వ్యాపించింది.

★ అజిత్‌సింగ్, లాలాలజపతిరాయ్, జైపాల్ రామ్ గంగారామ్, పండిట్ చంద్రిక దత్, స్వామి శ్రద్ధానంద్ పంజాబ్‌లో; చిదంబరం పిళ్లై, పి. ఆనందాచార్యులు, సుబ్రమణ్య అయ్యర్, టి.ఎం.నాయర్ మద్రాసు రాష్ట్రంలో; గాడిచర్ల హరిసర్వోత్తమరావు, గొల్లపూడి సీతారామస్వామి, అయ్యదేవర కాళేశ్వరరావు ఆంధ్రప్రదేశ్‌లో స్వదేశీ ఉద్యమాన్ని ప్రచారం చేశారు. వందేమాతర ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టింది.

## విభేదాలు

- ★ 1906లో దాదాభాయ్ నౌరోజీ అధ్యక్షతన కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో స్వరాజ్య సాధనే కాంగ్రెస్ లక్ష్యంగా ప్రకటించారు. దీంతో అతివాదులు, మితవాదుల మధ్య నెమ్మదిగా విభేదాలు ప్రారంభమయ్యాయి.
- ★ మితవాదులు విదేశీ వస్తు బహిష్కరణను ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే ఉపయోగించాలని భావించగా, అతివాదులు బహిష్కరణ ఉద్యమాన్ని అన్ని ప్రాంతాలకు, బ్రిటిష్ ప్రభుత్వంతో సహాయ నిరాకరణకు కూడా ఉపయోగించాలని భావించారు.
- ★ బ్రిటిష్‌వారు మితవాదులను తమవైపు తిప్పుకోవడానికి శాసన మండళ్ల సంస్కరణకు హామీ ఇచ్చారు. 1907 డిసెంబరు 26న సూరత్‌లో కాంగ్రెస్ సమావేశం ప్రారంభమైంది. సమావేశానికి అధ్యక్షుడిగా మితవాదులు రాస్ బిహారి ఘోష్ పేరును ప్రకటించగా దాన్ని అతివాదులు వ్యతిరేకించారు. దీంతో సుమారు 1600 మంది హాజరైన సభలో గందరగోళం నెలకొంది. ఇది చివరికి కాంగ్రెస్ అతివాదులు, మితవాదులుగా చీలిపోవడానికి దారితీసింది.
- ★ 1916లో లక్నోలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో అనిబిసెంట్ ప్రయత్నాల వల్ల మితవాదులు, అతివాదులు మళ్లీ కలిశారు.
- ★ మరోవైపు 1906లో ఢాకాలో ఏర్పాటు చేసిన ముస్లింలీగ్ సంస్థ బెంగాల్ విభజనకు మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ప్రారంభించింది. విభజన వల్ల ముస్లింలకు లబ్ధి చేకూరుతుందని ప్రచారం చేసింది.
- ★ తూర్పు బెంగాల్‌లో ఎక్కువమంది అగ్రకులాలకు చెందిన హిందూ భూస్వాములు, ముస్లింలలో అధికులు పేదరైతులు. విభజన వల్ల తూర్పు బెంగాల్‌లో ముస్లిం మెజారిటీ ఏర్పడుతుందని తద్వారా ముస్లింలకు ఎక్కువ ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రయోజనాలు కలుగుతాయని ముస్లింలీగ్, బ్రిటిష్ ప్రభుత్వం పేర్కొన్నాయి.
- ★ 1906 మే, 1907 మార్చి మధ్య కాలంలో తూర్పు బెంగాల్‌లోని మైమెన్‌సింగ్ జిల్లాలో హిందూ జమీందార్లు, వడ్డీ వ్యాపారులే లక్ష్యంగా మత ఘర్షణలు చెలరేగాయి.

| విజయాలు | అపజయాలు |
|---|---|
| ★ అతివాదులు సామాన్య ప్రజలను కూడా జాతీయోద్యమంలో భాగస్వాములుగా చేశారు.<br>★ స్వరాజ్యం భారతీయుల జన్మహక్కు అని ప్రకటించారు.<br>★ జాతీయ స్థాయిలో బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించారు. | ★ అతివాదులు ఉద్యమాన్ని రైతులు, వ్యవసాయ కార్మికుల చెంతకు తీసుకెళ్లలేకపోయారు.<br>★ బ్రిటిష్‌వారి 'విభజించి పాలించు' విజయవంతం కావడంతో హిందూ – ముస్లింల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. |

## మాదిరి ప్రశ్నలు

**1.** 'స్వరాజ్యం నా జన్మహక్కు దాన్ని సాధించి తీరుతాను' అని ప్రకటించిందెవరు?

ఎ) గోపాలకృష్ణ గోఖలే బి) దాదాభాయ్ నౌరోజీ

సి) బాలగంగాధర తిలక్ డి) లాలాలజపతిరాయ్

**2.** బెంగాల్ విభజనను ఏ సంవత్సరంలో రద్దు చేశారు?

ఎ) 1911 బి) 1912 సి) 1913 డి) 1908

**3.** బాలగంగాధర తిలక్ 1893లో ప్రారంభించింది?

ఎ) శివాజీ ఉత్సవం బి) గణపతి ఉత్సవం

సి) సరస్వతి ఉత్సవం డి) ఏదీకాదు

**4.** అతివాద ఉద్యమ ప్రారంభానికి ఏ దేశ విప్లవ ఉద్యమం కారణం కాదు?

ఎ) ఐర్లాండ్ బి) రష్యా సి) ఈజిప్ట్ డి) జపాన్

**5.** తిలక్ కేసరి పత్రికను ఏ భాషలో ప్రచురించారు?

ఎ) ఇంగ్లిష్ బి) హిందీ సి) గుజరాతీ డి) మరాఠీ

**6.** 'అన్ హ్యాపీ ఇండియా' పుస్తక రచయిత ఎవరు?

ఎ) దాదాభాయ్ నౌరోజీ బి) అరబిందో ఘోష్

సి) రవీంద్రనాథ్ ఠాగూర్ డి) లాలాలజపతిరాయ్

**7.** బెంగాల్ జాతీయ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన వ్యక్తి ఎవరు?

ఎ) సురేంద్రనాథ బెనర్జీ బి) బిపిన్ చంద్రపాల్

సి) అరబిందో ఘోష్ డి) ఎవరూకాదు

**8.** బెంగాల్ విభజన అమల్లోకి వచ్చిన తేదీ?

ఎ) 1905 అక్టోబరు 16 బి) 1905 జులై 19

సి) 1905 ఆగస్టు 7 డి) 1905 జనవరి 1

**9.** వందేమాతరం ఉద్యమ ప్రారంభం నాటి భారత రాజ్య కార్యదర్శి?

ఎ) లార్డ్ మింటో బి) మోర్లే సి) లార్డ్ కర్జన్ డి) డల్హౌసీ

**10.** అమర్ సోనార్ బంగ్లా గీత రచయిత?

ఎ) రజనీకాంత్ సేన్ బి) ముకుందదాస్

సి) రవీంద్రనాథ్ ఠాగూర్ డి) డి.ఎం. మజుందార్

**11.** 'ఆనంద మఠం' గ్రంథ రచయిత ఎవరు?

ఎ) దేవేంద్రనాథ్ ఠాగూర్ బి) బంకించంద్ర ఛటర్జీ

సి) బాలగంగాధర తిలక్ డి) దయానంద సరస్వతి

**జవాబులు**

1-సి; 2-ఎ; 3-బి; 4-డి; 5-డి; 6-డి; 7-సి; 8-ఎ; 9-బి; 10-సి; 11-బి.

**రచయిత: భాస్కర్ వేడియం**

www.eenadupratibha.net
www.eenadupratibha.net